

జలసోయగం

సీఎస్‌పురం (పామూరు): ఎత్తైన శిఖరం నుంచి ఎగసిపడుతున్న జలధారలతో భైరవకోన జలపాతం చూపరులను కట్టిపడేస్తోంది. భైరవకోనలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి అక్కడి జలపాతం ఎగసిపడుతోంది. జలపాతాన్ని చూసేందుకు పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

గరిష్ఠం/కనిష్ఠం
36.1/28.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

చట్టాలపై సామాన్యులు అవగాహన పెంచుకోవాలి

ఒంగోలు టౌన్: దేశంలోని ప్రజలంతా చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని విశ్రాంత న్యాయశాస్త్ర ప్రొఫెసర్ కటారి శ్రీనివాసరావు చెప్పారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం చట్టం–న్యాయం అనే మాసపత్రికను జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆవిష్కరించారు. నల్సా, సల్సా, న్యాయసేవాధికార సంస్థలు కలిగిస్తున్న అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దళితులు, ఇతర పీడిత వర్గాలు చట్టాన్ని సద్వినియోగం చేసుకునేందుకు తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చావలి సుధాకర్, విశ్రాంత సబ్ కలెక్టర్ పి.పేరయ్య, కరణం రాఘవరావు, జాలాది మోహన్, లావణ్య, నరసింహారావు, మేడికొండ జార్జి, అంకయ్య, శ్రీకృష్ణ, గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ చాంపియన్‌గా కుమారస్వామి

ఒంగోలు: జిల్లా స్థాయి చెస్ చాంపియన్‌గా పోలూరి కుమారస్వామి నిలిచారు. స్థానిక భాగ్యనగర్‌లో ఆదివారం జేకే రాజు చెస్ అకాడమీలో జిల్లా స్థాయి చెస్ చాంపియన్‌షిప్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో ఓపెన్ విభాగంలో కుమారస్వామి చాంపియన్‌గా నిలవగా తదుపరి మూడు స్థానాల్లో సాయి తనీష్, విష్ణు, జయకృష్ణ నిలిచారు. మహిళా విభాగంలో ప్రియాంక, జాహ్నవి మణి, ఇషాన్వి నల్లూరి, కే జాహ్నవి విజయం సాధించారు. వీరు ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి చదరంగ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని ప్రకాశం జిల్లా చెస్ అసోసియేషన్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ఎస్‌కె అబ్దుల్ నబీ తెలిపారు.

పుస్తకాలు సిద్ధం

విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాంలు, బెల్టులు, బూట్లు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, బ్యాగ్‌తో కూడిన జగనన్న విద్యాకానుక అందించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమరం ముగిసిపోయినా పేద విద్యార్థులపట్ల చిత్తశుద్ధి చూపుతూ పిల్లలకు అవసరమైన పుస్తకాలు సమకూర్చారు.

- సిద్ధమవుతున్న జగనన్న విద్యాకానుక
- ఎన్నికలైపోయినా విద్యార్థుల పట్ల అభిమానం చాటుకున్న సీఎం వైఎస్ జగన్
- ఇప్పటికే గోదాములో సిద్ధంగా 4.80 లక్షల పాఠ్య పుస్తకాలు
- నేరుగా ఉన్నత పాఠశాలలకే చేరనున్న మరో 7 లక్షల పాఠ్య పుస్తకాలు
- మండల విద్యావనరుల కేంద్రాలకు చేరిన 9.90 లక్షల నోట్ పుస్తకాలు



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం వచ్చిన పాఠ్యపుస్తకాలు

ఒంగోలు: రాష్ట్ర వ్యాప్తంగా బడి తెరిచే నాడే ప్రతి విద్యార్థికి జగనన్న విద్యాకానుక కిట్ అందించేందుకు ఇప్పటికే చర్యలు ముమ్మరం అయ్యాయి. ప్రతి సారి పాఠ్యపుస్తకాలు, జగనన్న విద్యాకానుక కిట్లు మండల విద్యావనరుల కేంద్రానికి చేరడం, అక్కడ నుంచి పాఠశాలలకు సరఫరా చేస్తారు. అయితే ఈ దఫా అందుకు భిన్నంగా కేవలం 1 నుంచి 7 తరగతుల వరకు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల పుస్తకాల గోదామునకు చేరనున్నాయి. మొత్తం 16 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం అని గుర్తించగా అందులో 1.80 లక్షల పాఠ్యపుస్తకాలు పాతవి గోదాములో నిల్వ ఉన్నాయి. మరో 3 లక్షల పుస్తకాలు ఇప్పటికే గోదాముకు చేరాయి. మరో 4.70 లక్షల పాఠ్య పుస్తకాలను రెండో విడతలో భాగంగా ఈనెలాఖరుకు జిల్లాకు చేర్చాలని ప్లాన్ చేశారు. ఇక 8, 9, 10 తరగతులకు చెందిన 7 లక్షల పాఠ్య పుస్తకాలను నేరుగా ఉన్నత పాఠశాలలకే పంపాలని నిర్ణయించారు.



కొత్తపట్నంలోని పుస్తకాల స్టాకు

మండల కేంద్రాలకు చేరుతున్న జగనన్న విద్యాకానుక కిట్లు:

జగనన్న విద్యా కానుక కిట్లు మండల కేంద్రాలకు చేరుతున్నాయి. జిల్లాలో 1,93,440 మంది విద్యార్థులకు ఈ కిట్లు పంపిణీ చేయనున్నారు. ఇందుకుగాను 10,09,436 నోటు పుస్తకాలు అవసరం అవుతాయని నిర్ధారించారు. ఈ క్రమంలో 9,90,560 నోటు పుస్తకాలు మండల విద్యావనరుల కేంద్రాలకు చేరాయి. ఇంకా కేవలం 18876 పుస్తకాలు మాత్రమే జిల్లాకు చేరాల్సి ఉంది. ఇక బూట్లు, బ్యాగులు, బెల్టులు, యూనిఫాం జిల్లాకు ఒకటి రెండు రోజుల్లో చేరనున్నాయి. అయితే 8వ తరగతి విద్యార్థులు 23914 మందికి ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందించాల్సి ఉంది. ఇందుకుగాను ఇండెంట్ కూడా పంపారు. ఇవి కూడా రెండు మూడు రోజుల్లో జిల్లాకు వస్తాయని అధికారులకు సమాచారం అందింది.

పుస్తకాల సరఫరాకు సిద్ధమవుతున్న ఆర్టీసీ:

ఏటా పాఠ్యపుస్తకాల సరఫరాకు సంబంధించి ఆర్టీసీ వాహనాలను అందిస్తోంది. ఈ ఏడాది కూడా పాఠ్యపుస్తకాల సరఫరాకు సిద్ధమైంది. వారం క్రితమే విద్యాశాఖ అధికారులను సంప్రదించారు. ఎన్నికలు ముగిసిన అనంతరం పంపాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే ఆర్టీసీ అధికారులు కూడా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన హమాలీలను సిద్ధం చేసుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రోజు సిద్ధమని సమాచారమిస్తే ఆ రోజునుంచే పుస్తకాల సరఫరా ప్రక్రియ పూర్తిచేసేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉంది.

రెండు మూడు రోజుల్లో జిల్లాకు పూర్తి స్థాయి కిట్లు



జగనన్న కిట్లలోని నోట్ పుస్తకాలు ఇప్పటికే అన్ని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాలకు చేరుకున్నాయి. మిగిలిన బూట్లు, బ్యాగులు, డిక్షనరీలు, బెల్టులు, యూనిఫాం తదితరాలు కూడా రెండు మూడు రోజుల్లో పంపుతామని ఇప్పటికే సమాచారం అందింది. ఈ మేరకు రాష్ట్ర స్థాయి అధికారులు కూడా ఈ విషయమై తగు ఏర్పాట్లు చేసుకోవాలని ఇప్పటికే ఆదేశించారు. కిట్లు పూర్తి స్థాయిలో చేరగానే వాటిని పాఠశాలలకు పంపేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. 8, 9, 10 పాఠ్యపుస్తకాలు మాత్రం నేరుగా ఉన్నత పాఠశాలలకు పంపనున్నారు. బడి తెరిచే నాటికే జగనన్న విద్యాకానుక కిట్లు విద్యార్థులకు అందించగలుగుతాం.

– టి.కిషోర్‌బాబు, ఒంగోలు ఎంఈవో

నిశిరాత్రి
మృత్యుకేక

వారంతా కష్టజీవులు.. రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలు.. ఒకే రోజు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురిని మృత్యువు కబళించింది. మరో తొమ్మిది మంది క్షతగాత్రులయ్యారు. మృతులు ముగ్గురూ కుటుంబ పెద్దలే..! ఆ ఇంటి పెద్ద దిక్కులు నిర్జీవంగా పడిఉంటే.. తమకింక దిక్కెవరంటూ.. అనాథలుగా మిగిలిన బిడ్డలు దిక్కులు పిక్కటిల్లేలా కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

- వేర్వేరు ఘటనల్లో ఒకే రోజు కనిగిరి నియోజకవర్గంలో ముగ్గురు మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- మరో ఏడుగురికి తీవ్ర గాయాలు



దారమడుగు వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు ముందు భాగం



కనిగిరి వద్ద ప్రమాదంలో నుజ్జు అయిన కారు

కనిగిరి రూరల్/వెలిగండ్ల: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో కనిగిరి నియోజకవర్గానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం సమీపంలోని దారమడుగు వద్ద ఆర్టీసీ బస్సు–లారీ ఢీకొని ఇద్దరు, కనిగిరి దేవాంగనగర్ సమీపంలో ఆటో–కారు ఢీకొని మరొకరు మృత్యువాతపడ్డారు. వివరాల్లోకి వెళ్తే..కనిగిరి ఆర్టీసీ డిపో నుంచి స్పెషల్ బస్సు (అల్ట్రా డీలక్స్)లో సుమారు 43 మంది చెన్నైకి శనివారం రాత్రి బయలు దేరారు. ఈ బస్సు వయా వెలిగండ్ల, సీఎస్‌పురం మీదుగా చెన్నైకు చేరుతుంది. మొత్తం సీట్లు రిజర్వేషన్ అయ్యాయి. బస్సు 9.30 గంటలకు వెలిగండ్ల పాయింట్‌కు, 10 గంటలకు సీఎస్‌పురం పాయింట్‌కు వెళ్లి బయలు దేరింది. బస్సులో దాదాపు అందరూ కనిగిరి నియోజకవర్గానికి చెందిన వారే ఉన్నారు. వీరిలో ఎన్నికల్లో ఓటు వేసేందుకు వచ్చి తిరిగి వెళ్లేవారు కొందరుండగా, మరికొందరు సొంత పనులపై వచ్చి తిరిగి వెళ్తున్న వారున్నారు. రాత్రి సుమారు 1.15 గంటలకు బస్సు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం సమీపంలో దామరమడుగు వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో వెలిగండ్ల మండలం గన్నవరానికి చెందిన వేమవరపు మరియమ్మ (46), వెలిగండ్ల మండలం కంకణంపాడుకు చెందిన వేమవరపు డేవిడ్ (50) మృతి చెందారు. మృతుడు వీ డేవిడ్ భార్య విశ్రాంతమ్మకు బలమైన గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. అదే గ్రామానికి చెందిన గంధం అరుణ్‌కుమార్‌కు, మరపగుంట్లకు చెందిన సలోమి, రవికుమార్‌లకు, ఆర్‌కే పల్లికి చెందిన వీ నాగయ్య, రమాదేవికి తీవ్ర గాయాలయ్యాయి.

గృహప్రవేశానికి వచ్చి వెళ్తూ మృత్యులోకానికి..



వేమవరపు మరియమ్మ (ఫైల్)



మృతురాలు వేమవరపు మరియమ్మ

వెలిగండ్ల మండలంలోని రామగోపాలపురానికి చెందిన వేమవరపు మరియమ్మ(45) ను గన్నవరం గ్రామానికి చెందిన వేమవరపు సుదర్శనంకు ఇచ్చి వివాహం చేశారు. వీరిద్దరికీ ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో ముగ్గురికి వివాహం కాగా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడికి వివాహం కాలేదు. భర్త సుదర్శనం ఏడేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటి నుంచి మరియమ్మ చెన్నైలోని ఓ కాలేజీలో పనిచేస్తూ ముగ్గురు పిల్లలను పోషిస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటు వేసేందుకు వెలిగండ్లకు వచ్చి తిరిగి చెన్నైకి వెళ్లింది. మళ్లీ కనిగిరి మండలం మాచవరంలో తన చిన్నాయన కుమార్తె గృహ ప్రవేశానికి మాచవరం వచ్చి తిరిగి వెళ్తూ ఉండగా ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. మరియమ్మ ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు అనాథలుగా మారారు. దీంతో రామగోపాలపురం, గన్నవరంలో ఉన్న వారి బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.



బస్సులో మృతులు, క్షతగాత్రులు



మరియమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న పిల్లలు, బంధువులు

మనుమరాలు చెన్నైకి రమ్మందని...



వేమవరపు డేవిడ్ (ఫైల్)



వేమవరపు డేవిడ్ మృతదేహం

బస్సు ప్రమాదంలో వెలిగండ్ల మండలం కంకణంపాడు గ్రామానికి చెందిన వేమవరపు డేవిడ్ (50) మృత్యువాత పడ్డాడు. అతని భార్య విశ్రాంతమ్మకు తీవ్ర గాయాలు కాగా ఆమె చికిత్స పొందుతోంది. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం అయి చెన్నైలో ఉంటోంది. కుమారుడు ఎలీషాకు వివాహం కాలేదు. తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. జీవనోపాధి కోసం వేమవరపు డేవిడ్, మరియమ్మ, ఎలీషాలు హైదరాబాద్‌లో బేల్దారి పని చేసుకుంటున్నారు. ఓటు వేసేందుకు వీరు కంకణంపాడు వచ్చారు. చెన్నైలో ఉంటున్న మనుమరాలు తాతను, అమ్మమ్మను చెన్నైకి రమ్మని పిలిచిందని వీరిద్దరూ చెన్నై వెళ్తున్నారు. ఇంతలో మృత్యువు ఆ కుటుంబాన్ని బలి తీసుకుంది. డేవిడ్ మృతి, మరియమ్మకు తీవ్ర గాయాలు కావడంతో కంకణంపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి.





ఆటో, కారు ప్రమాదంలో క్షతగాత్రురాలు కస్తూరి, రామకృష్ణ



బస్సు ప్రమాదంలో గాయపడిన వేమవరపు విశ్రాంతమ్మ

టీ తాగేందుకు వచ్చి తనువు చాలించాడు

టీ తాగేందుకు తెల్లవారుజామున ఆటోలో కనిగిరికి వచ్చి తిరుగు ప్రయాణంలో బత్తుల విష్ణు (57) రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. దేవాంగ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ విష్ణు ఆదివారం తెల్లవారుజామున సుమారు 5 గంటలకు అల్లుడి ఆటోలో టీ తాగేందుకు కనిగిరికి వచ్చాడు. ఉదయం 5.15 నిమిషాలకు మరో ఆటోలో తిరుగు ప్రయాణం అయ్యాడు. ఈక్రమంలో విజయవాడ వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన డిజైర్ కారు దేవాంగనగర్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న బత్తుల విష్ణు (57) అక్కడికక్కడే మృతి చెందగా, గుండ్లతోటి గురవమ్మ, అమ్మనబోలు కస్తూరి, ఆటో డ్రైవర్ రామకృష్ణకు బలమైన గాయాలయ్యాయి. వీరికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్య కోసం ఒంగోలుకు తరలించారు. వీరిలో జీ గురవమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈమేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విష్ణు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిలో కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు యశ్వంత్ దివ్యాంగుడు.

తెరుచుకున్న కారు బెలూన్‌లు..

ఆటోను కారు ఢీ కొట్టిన ఘటనా స్థలాన్ని పరిశీలిస్తే కారు అతి వేగంగా వస్తున్నట్లు పోలీసులు, స్థానికులు చెప్తున్నారు. కారులోని రెండు బెలూన్‌లు తెరుచుకున్నాయి. దీంతో డ్రైవర్, అతని పక్కన ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలతో బయట పడ్డారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బత్తుల విష్ణు

కన్నీరు మున్నీరుగా...

నాలుగు రోజులుగా అనారోగ్యంతో ఆటో తోలకుండా ఇంట్లోనే ఉంటున్న భర్త విష్ణు కనిగిరిలో టీ తాగివస్తానని చెప్పి వెళ్లి.. విగత జీవిగా మారడంతో భార్య రమాదేవి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. ఇంట్లో నుంచి వెళ్లిన అరగంటలోనే మృత్యు ఒడి చేరడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. మన ఆటోలోనే తిరిగి వెళ్దాము అని అల్లుడు రవీంద్రా.. మామ విష్ణుకు చెప్పాడు. అయినా విష్ణు వినకుండా నేను వేరొకరి ఆటోలో ఇంటికి వెళ్తానని చెప్పి వెళ్లి శవంగా మారాడని.. తనతో వచ్చి ఉన్నా ప్రమాదం తప్పేదేమోనని అల్లుడు బోరున విలపిస్తున్నాడు.



బత్తుల విష్ణు (ఫైల్)

క్లుప్తంగా

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



మాక్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సుమిత్ సునీల్

ఒంగోలు టౌన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో పోలీసు బలగాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని స్పష్టం చేశారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఎవరైనా హింసాత్మక చర్యలకు పాల్పడినా వదిలిపెట్టేది లేదన్నారు. అల్లర్లను అణచివేసేందుకు తీసుకునే చర్యలను వివరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు 10 ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామని, జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పరిధిలో ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గుర్తించిన గ్రామాల్లో సాయుధ బలగాల మొబైల్ పార్టీలు తిరుగుతుంటాయని తెలిపారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ కిశోర్‌బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఒన్‌టౌన్ సీఐ అలీఖాన్, ఆర్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మాక్ డ్రిల్‌తో బెంబేలెత్తిన ప్రజలు...

ఒక్కసారిగా పోలీసులు లాఠీలతో ప్రజలపైకి ఎగబడటం, నీళ్లతో చెదరగొట్టే ప్రయత్నం చేయడం, గాలిలోకి కాల్పులు జరపడం లాంటి ఘటనలతో ప్రజలు బెంబేలెత్తారు. నగరం నడిబొడ్డులోని ఆర్టీసీ బస్టాండు సెంటర్లో పోలీసులు, బీఎస్ఎఫ్ బలగాలు దిగడంతో ఏం జరుగుతుందో తెలియక ఆందోళన పడ్డారు. కాసేపటి తర్వాత అదంతా మాక్‌డ్రిల్‌లో భాగమని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు.

టంగుటూరి ప్రకాశం.. చెరగని సంతకం..!

- ● ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా చరిత్రలో స్థానం
- ● పుట్టింది ప్రకాశం జిల్లా వినోదరాయునిపాలెంలోని అమ్మమ్మగారింట్లో..
- ● పెరిగింది.. స్వగ్రామం.. వల్లూరు
- ● సామాన్య కుటుంబం నుంచి ముఖ్యమంత్రిగా ఎదిగిన నాయకుడు
- ● బ్రిటీష్ వాడి తుపాకులకు ఎదురేగి కాల్చరా అంటూ గుండె చూపెట్టిన సాహసి
- ● నేడు ప్రకాశం పంతులు 67వ వర్ధంతి



ప్రకాశం పంతులు పేరుమీద నిర్మించిన ప్రకాశం భవనంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహం



టంగుటూరి ప్రకాశం పంతులు

ఒంగోలు టౌన్: దేశ చరిత్రలో టంగుటూరి ప్రకాశం పంతులు పేరు ఒక చెరగని సంతకం. సామాన్య నిరుపేద కుటుంబంలో పుట్టిపెరిగిన టంగుటూరి ప్రకాశం పంతులు దేశ స్వాతంత్య్ర పోరాటంలో తెలుగు వాడి పౌరుషాన్ని చాటి చెప్పారు. సైమన్ గో బ్యాక్ ఉద్యమంలో బ్రిటీష్ వాడి తుపాకులకు ఎదురొడ్డి దమ్ముంటే కాల్చండిరా అని ఛీంకరించారు. గుండె చీల్చి చూపెట్టారు. దాంతో తెల్ల ముష్కరులు భయంతో వెనుదిరిగారు. టంగుటూరి ప్రకాశం పంతులు స్వగ్రామం టంగుటూరు మండలంలోని వల్లూరు. అయితే, నాగులుప్పలపాడు మండలంలోని వినోదరాయునిపాలెంలోని అమ్మమ్మ ఇంట్లో పుట్టారు. 11 ఏళ్ల వయసులో ఉండగా తండ్రి గోపాలకృష్ణ మరణించారు. దాంతో తల్లి సుబ్బమ్మ బిడ్డను తీసుకుని ఒంగోలు చేరారు. కోర్టు సెంటర్లో పూటకూళ్ల (వసతి గృహాన్ని) నిర్వహిస్తూ చిన్నారి ప్రకాశంను పెంచి పెద్ద చేశారు. ప్రాథమిక విద్యాభ్యాసాన్ని కొంతకాలం ఒంగోలులో కొనసాగించిన ప్రకాశం పంతులు.. చదువులో రాణించారు. దాంతో ఆయన గురువు హనుమంతరావు తనతో పాటు రాజమహేంద్రవరం తీసుకెళ్లారు.

నల్లకోటుపై మక్కువతో...

ఒంగోలులోని కోర్టు ఎదురుగా పూటకోళ్లు నిర్వహిస్తున్న సమయంలో అక్కడికి ఎక్కువగా న్యాయవాదులు వచ్చేవారు. దాంతో తాను కూడా న్యాయవాది కావాలని ప్రకాశం పంతులు నిర్ణయించుకున్నారు. మెట్రిక్యులేషన్‌లో ఫెయిలైనప్పటికీ పట్టు వదలకుండా చదివి లా చేశారు. లండన్ వెళ్లి బారిస్టర్ చదివి ప్రాక్టీస్ చేశారు. సివిల్, క్రిమినల్ కేసులను వాదిస్తూ అనతికాలంలోనే మంచి న్యాయవాదిగా పేరు పొందారు. న్యాయవాదిగానే కాకుండా పాత్రికేయుడిగా లా టైమ్స్ అనే పత్రికకు ఎడిటర్‌గా వ్యవహరించారు. అనుకోకుండా ఆయన రాజమహేంద్రవరం మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాల్సి వచ్చింది. 31 ఏళ్ల పిన్న వయసులో మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికై చరిత్ర సృష్టించారు. ఆ తర్వాత ఆయన ఎన్నడూ వెనుదిరిగి చూడలేదు. రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగి మద్రాసు నుంచి విడిపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేశారు.



ఒంగోలు మండలం దేవరంపాడులో.. ప్రకాశం పంతులు ఏర్పాటు చేసిన ఉప్పుసత్యాగ్రహం విజయస్థూపం

జిల్లా గ్రంథాలయంలో...

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రకాశం పంతులు గ్రంథాలయం పేరుతో ఒక ప్రత్యేక గదిని కేటాయించారు. ఆంధ్రకేసరి మీద ప్రేమతో ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు గుళ్లాపల్లి ఆదినారాయణ ప్రకాశం పంతులుకు సంబంధించిన పుస్తకాలను సేకరించారు. ఆ పుస్తకాలతో పాటుగా మహాత్మా గాంధీ, నేతాజీ సుభాస్ చంద్రబోస్, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి జాతీయోద్యమ నాయకుల జీవిత చరిత్ర పుస్తకాలు, చిత్రాలను ఆయన గ్రంథాలయానికి బహూకరించారు. ఆ పుస్తకాలను ఇందులో భద్రపరిచినట్లు ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి తెలిపారు. ఈ గదిని ఆనాటి ఆర్థిక శాఖామంత్రి కొణిజేటి రోశయ్య ప్రారంభించడం జరిగింది. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రతి ఏడాది ఆగస్టులో అధికారికంగా జయంతిని నిర్వహించడం జరుగుతుంది.

కనుమరుగైన ఐల్యాండ్ విల్లా...

ఒంగోలు నగరంలోని బాలాజీరావుపేటలో, ప్రస్తుతం సీపీఎం ప్రజా సంఘాల కార్యాలయం ఎల్బీజీ భవనానికి ఎదురుగా అప్పట్లో ప్రకాశం పంతులు సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నారు. రాజమండ్రి నుంచి పడవల్లో కలపను ఉలిచికి తెప్పించి అక్కడి నుంచి ఒంగోలు తరలించారు. ఇంటి నిర్మాణంలో మేలురకం కలపను వినియోగించారు. అప్పట్లో ఆ ప్రాంతంలో చెరువు ఉండేది. ఎటుచూసినా నీరు నిలిచి ఉండేది. దాంతో ప్రకాశం ఇంటిని ఐ ల్యాండ్ విల్లా అని పిలిచేవారు. పట్టించుకునేవారెవరూ లేకపోవడంతో ప్రస్తుతం ఆయన నివాసం కనుమరుగైపోయింది.

తెలుగు నాన్‌డిటైల్‌ను పునరుద్ధరించాలి...

గతంలో 7వ తరగతి విద్యార్థులకు తెలుగు ఉపవాచకంలో ప్రకాశం పంతులు జీవిత చరిత్ర బోధించేవారు. కాలక్రమంలో దాన్ని తొలగించారు. దీంతో దేశం కోసం ప్రకాశం పంతులు చేసిన త్యాగాలు, బ్రిటీష్ ముష్కరులతో చేసిన పోరాటాలు నేటి తరానికి తెలియకుండా పోయాయని సాహిత్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భావి తరాలకు ప్రకాశం పంతులు గురించి తెలుసుకునేలా పాఠ్య పుస్తకాలలో ఆయన జీవిత చరిత్రను చేర్చాలని పలువురు కోరుతున్నారు.

ప్రకాశం జిల్లా ఏర్పాటు...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ తర్వాత 1970 ఫిబ్రవరి 2వ తేదీ ఒంగోలు జిల్లా ఏర్పడింది. అయితే, రెండేళ్ల తర్వాత 1972లో జిల్లాకు టంగుటూరి ప్రకాశం పంతులు పేరుతో ప్రకాశం జిల్లాగా నామకరణం చేశారు. అప్పటికే ప్రకాశం పంతులు మరణించి 15 ఏళ్లు అయింది. జిల్లా పరిపాలన వ్యవస్థకు మూలకేంద్రమైన కలెక్టర్ కార్యాలయానికి కూడా ప్రకాశం భవనం అని పేరుపెట్టారు. కలెక్టర్ కార్యాలయంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వినోదరాయునిపాలెంలో పీవీ చేతుల మీదుగా ప్రకాశం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని ముంగమూరు రోడ్డు పేరును ఆంధ్రకేసరి మార్గ్‌గా మారుస్తూ ఇటీవల నగరపాలక సంస్థ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు ఆర్చి నిర్మించేందుకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన కూడా చేశారు.

కనిగిరిలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తాం

● బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసిన దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: కనిగిరి నియోజకవర్గంలో మంచి మెజార్టీతో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తున్నామని వైఎస్సార్ సీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే, అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆయన కలిశారు. ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ పరిశీలకుడు చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పార్టీ నేతలతో కలిసి మర్యాదపూర్వకంగా బాలినేనిని దద్దాల నారాయణ యాదవ్ కలిశారు. కనిగిరి నియోజకవర్గంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ సరళి, రాజకీయాలు, తదితర విషయాలను బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వివిధ అంశాలపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ మాట్లాడుతూ తనకు కనిగిరి సీటు ఇచ్చినప్పటి నుంచి తన వెన్నంటి ఉన్న పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య నాయకులు తనకెంతో సహకారం అందించారని తెలిపారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేశారని చెప్పారు. అందరి సమిష్టి కృషితో కనిగిరిలో తాను అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తున్నానని బాలినేనికి దద్దాల వివరించారు. దద్దాల నారాయణ వెంట నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన పార్టీ నాయకులు ఉన్నారు. తొలుత బాలినేనికి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.



బాలినేని శ్రీనివాసరెడ్డితో దద్దాల నారాయణ యాదవ్, చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి, వైఎం ప్రసాద్‌రెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, కస్తూరిరెడ్డి, పార్టీ నేతలు

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

ముండ్లమూరు: మండలంలోని ఉమామహేశ్వరపురంలో ఈ నెల 13న ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎన్నికల విధుల్లో ఉన్న మహిళా పోలీస్‌ను గ్రామానికి చెందిన కొందరు కులం పేరుతో దూషించడంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై ఆదివారం సాయంత్రం దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ గ్రామంలోని పోలింగ్ స్టేషన్ వద్ద బాధితురాలితో కలిసి విచారణ నిర్వహించారు. ఎన్నికల పోలింగ్ జరుగుతుండగా గ్రామస్తులో క్యూలో రాకపోవడంతో అక్కడున్న పోలీసులు క్యూలో రావాలని సూచించారు. వారి మధ్య గొడవ జరుగుతుండగా అక్కడే ఉన్న మహిళా పోలీస్ కె.అనూష స్థానికులకు క్యూలో రావాలని కోరారు. దీంతో స్థానికులు జిల్లెలమూడి రామకృష్ణ, మరో 12 మంది అనూషను కులం పేరుతో దూషిస్తూ ఆమెతో గొడవకు పాల్పడ్డారు. దీంతో అనూష స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా డీఎస్పీ అశోక్‌వర్ధన్ గొడవకు కారణమైన వారితో పాటు బాధితురాలిని, స్థానికులను విచారించారు. ఆయన వెంట ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది వెంకటేశ్వర్లు, ప్రేమనిధి ఉన్నారు.



విచారణ చేస్తున్న డీఎస్పీ అశోక్‌వర్ధన్

వృద్ధురాలి దారుణ హత్య

● పోలీసుల అదుపులో ఇద్దరు అనుమానితులు ?



నాగేశ్వరమ్మ మృతదేహం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ (క్రైం) శ్రీధర్ రావు, డీఎస్పీ కిశోర్ బాబు

ఒంగోలు టౌన్: కల్లు విక్రయించుకుంటూ జీవనం సాగించే ఒక వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చడం సంచలనం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం... కొత్తపట్నంలోని రెడ్డిపాలెం నాంచారమ్మ ఆర్చి సమీపంలో గుడిపల్లి నాగేశ్వరమ్మ (75) కల్లు దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. కుమారుడు ప్రకాశ్ ఒంగోలులోని ఒక ప్రైవేటు బ్యాంకులో వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. కోడలు మార్కాపురంలో ఉద్యోగం చేస్తుంటుంది. శనివారం రాత్రి ఎప్పటిలాగే కుమారుడు విధులు నిర్వహించేందుకు ఒంగోలు వెళ్లాడు. తెల్లవారుజామున ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న నాగేశ్వరమ్మను కల్లుగీత కార్మికుడు ఒకరు వచ్చి నిద్రలేపేందుకు ప్రయత్నించగా ఆమె లేవలేదు. దాంతో అనుమానం వచ్చిన అతడు ఇరుగు పొరుగు వారికి, కుమారుడికి సమాచారం ఇచ్చారు. కుమారుడు వచ్చి చూడగా తల్లి మరణించి ఉంది. చెవి, ముక్కు, మెడ మీద గాయాలున్నాయి. ఇంటి లోపలకు వెళ్లి పరిశీలించగా బీరువా తాళాలు పగులగొట్టి ఉంది. ఇంట్లోని సామాన్లు చిందవందరగా పడేసి ఉన్నాయి. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వెంటనే అడిషనల్ ఎస్పీ (క్రైం) శ్రీధర్ రావు, ఒంగోలు డీఎస్పీ కిశోర్ బాబు ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీం సాక్ష్యాలను సేకరించింది. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు అనుమానితులు...

ఇదిలా ఉండగా పోలీసు డాగ్‌ను రంగంలో దించి విచారణ చేసే క్రమంలో పోలీసులు కొంత కీలక సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. మృతురాలి ఇంటి వద్ద నుంచి బయలుదేరిన పోలీసు డాగ్ సమీపంలోని రెండు ఏటీఎంల వద్ద కాసేపు నిలబడి కొత్తపట్నం బస్టాండు వద్ద ఆగిపోయింది. దాంతో రోజూ కల్లు తాగేందుకు వచ్చే వ్యక్తులను విచారిస్తున్నారు. అలాగే రెండు రోజుల క్రితమే ఇద్దరు వ్యక్తులు పనిలో చేరినట్లు సమాచారం. ఆ ఇద్దరిపై అనుమానంతో అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈదురు గాలులతో వాన

● పంటలకు నష్టం

త్రిపురాంతకం: ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం, వడగండ్ల వానకు త్రిపురాంతకం మండలంలోని గ్రామాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు త్రిపురాంతకం మండలంలో ఈదురు గాలుల వర్షానికి ప్రజా జీవనానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. కంకణాలపల్లి గ్రామంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పది ఎకరాల్లో బొప్పాయి, రెండెకరాల్లో అరటి పంటలకు నష్టం జరిగింది. గ్రామంలో ఇంటిపైకప్పు రేకులు, పూరిల్లు ఎగిరిపోవడంతో పన్నెండు ఇళ్లు దెబ్బతిని ప్రజలు నిరాశ్రయులయ్యారు. త్రిపురాంతకంలో రైస్‌మిల్ గోడ కూలి పక్కనే ఉన్న ఇంటిపై పడింది. అదృష్టవశాత్తూ ఆ ఇంట్లో ఉన్న మహాలక్ష్మమ్మ ప్రాణాలతో బయటపడింది. అధికారులు పంటనష్టాలు అంచనా వేస్తున్నారు.



కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభం



కంకణాలపల్లిలో ఈదురుగాలులు, వడగండ్ల వానకు కూలిన బొప్పాయి తోట



త్రిపురాంతకంలో రైస్‌మిల్ గోడ కూలి దెబ్బతిన్న ఇల్లు



రేకులు ఎగిరిపోయిన ఇల్లు